క్లుప్తంగా

కుక్కల బెడద నుంచి రక్షించాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ప్రతి డివిజన్‌లో కుక్కల బెడద అధికమయిందని వాటి నుంచి నగర ప్రజలను రక్షించాలని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పఠాన్ ఖాదర్‌బాష, అన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ చాంద్‌బాష కోరారు. ఈ విషయమై శుక్రవారం కడప నగర కమిషనర్ మనోజ్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుక్కల బెడదతో రాత్రిపూట నగరంలో తిరగాలంటే ప్రజలు భయాందోళనకు గురి కావాల్సి వస్తుందన్నారు. చాలా వీధుల్లో చిన్న పిల్లలు కుక్కకాటుకు గురవుతున్నారన్నారు. కొన్ని సందర్భాలలో రిమ్స్‌లో కుక్కకాటుకు సంబంధించిన ఇంజక్షన్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఫాతిమా మెడికల్ కళాశాల, హాస్పిటల్ ఆధ్వర్యంలో సీకే దిన్నె మండల కేంద్రంలోని శివాలయం వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం న్విహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, చర్మ వ్యాధులు, ఆర్థోపెడిక్, గైనకాలజీ, చిన్నపిల్లల సమస్యలు, చెవి, ముక్కు, గొంతు సమస్యలు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, ఊపిరితిత్తుల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తారన్నారు. శిబిరంలో స్త్రీలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలుకూడా నిర్వహిస్తారన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడే వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత శిక్షణ

కడప కల్చరల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరు నగరంలో కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరి ప్రసాద్ తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారికి ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తామన్నారు. 35 రోజులపాటు శిక్షణానంతరం రూ. 15 వేతనంతో ఉపాధి కల్పిస్తామన్నారు. వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహా సంఘ్ నూతన క్యాలెండర్‌ను శుక్రవారం వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి. విశ్వనాథ కుమార్, కులసచివులు ఎస్. రాజేష్ కుమార్‌రెడ్డి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సెలవు దినాలకు అనుగుణంగా క్యాలెండర్ వుందని వర్సిటీ రిజిస్ట్రార్ అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అదనపు పరీక్ష నియంత్రణాధికారి డా. జి. ఫణీంద్ర రెడ్డి, వర్సిటీ పౌరసంబంధాల అధికారి వి. శివకృష్ణా రెడ్డిలు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన బ్యాక్ వర్డ్ కమ్యూనిటీ లిటరసీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు చదిపిరాళ్ల విజయ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మురికి వాడల్లోని నిరుపేదలకు పండ్లు పంపిణీ చేశారు. విజయ్‌బాబు మాట్లాడుతూ పాత రిమ్స్‌లో ఆదరణ హోం నిర్వహిస్తున్నామని, నిరాశ్రయులకు అందులో వసతి కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో జోజప్ప, జార్జి, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం పెంచాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, సంక్షేమ హాస్టళ్లలో అమలవుతున్న మధ్యాహ్నభోజన పథకానికి నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేస్తామని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం హర్షణీయమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చాలా తక్కువగా ఉన్న వంట ఛార్జీలు, వంట ఏజన్సీలకు గౌరవ వేతనం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో.. ఒక్కొక్క విద్యార్థికి ప్రాథమిక పాఠశాలల వారికి రూ.10, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ. 15 ఇవ్వాలన్నారు. అప్పుడే కూరల నాణ్యత కూడా పెరుగుతుందన్నారు. అదే విధంగా వంట ఏజన్సీల గౌరవ వేతనంగా ప్రస్తుతం నెలకు రూ. 3వేలు అంటే రోజుకు వంద రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని దీనిని రూ.9వేలకు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

నబీకోట షిరిడి సాయి మందిర్ ధర్మకర్త మృతి

కడప అర్బన్: కడప నగరంలోని నబీ కోటలో ఉన్న శ్రీ షిరిడి సాయి మందిర్ ధర్మకర్త గోదిన కృష్ణమూర్తి (73) శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈయన వైద్య ఆరోగ్యశాఖలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గా పనిచేస్తూనే 1999లో కడప నబి కోటలో షిరిడి సాయి మందిర్ ను నిర్మింప చేశారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ, ఆధ్యాత్మిక సేవలను అందించారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాదారు.

సర్వలోక రక్షకురాలు లూర్దుమాత

కడప కల్చరల్ : లూర్దుమాత తనను విశ్వసించిన సర్వ లోకాన్ని రక్షించగల తల్లి అని క్రైస్తవ గురువులు పేర్కొన్నారు. లూర్దుమాత నవదిన కార్యక్రమాల్లో భాగంగా ఆరవరోజు శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు మరియాపురంలోని పెద్ద చర్చి ఆవరణలో విశేష ప్రార్థనలు చేశారు. తొలుత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీపై లూర్దుమాత స్వరూపాన్ని నిలిపి విశ్వాసులు ఊరేగింపుగా మరియాపురం వీధుల ద్వారా స్తుతి గీతాలు ఆలపిస్తూ ప్రధాన ప్రార్థనా వేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆ స్వరూపాన్ని వేదికపై ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మరియాపురం నుంచి అభిషిక్తులైన గురువులు ప్రసంగించారు. లూర్దుమాత లోక రక్షకుడైన ప్రభువైన ఏసుక్రీస్తుకు తల్లిగా ఉండడంతోపాటు మహిళలందరిలో మాతృత్వపు దయ, కరుణ గుణాలను నెలకొల్పారని వివరించారు. అభిషిక్త గురువుల్లో కొందరు దివ్య బలి పూజ నిర్వహించారు. మౌలిక సంఘం సభ్యులు ప్రధాన వేదికపై క్రైస్తవ స్తుతి గీతాలను ఆలపించగా, మరికొందరు పీఠాన్ని రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో కళ్లు చెదిరేలా అలకంరించారు.


ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు


దైవ సందేశాన్ని అందజేస్తున్న క్రైస్తవ గురువులు


గురువులను స్వాగతిస్తున్న చిన్నారులు

శ్రీవేంకటరమణ.. గోవిందా..


సింహవాహనంపై శ్రీవేంకటరమణుడు

పులివెందుల టౌన్ : మము కరుణించరావా శ్రీవేంకటరమణ.. గోవిందా.. గోవిందా అంటూ భక్తులు స్వామివారిని ఆరాధించారు. పట్టణంలో వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం ఉదయం శ్రీవారు సింహ వాహనంపై దర్శనమిచ్చారు. సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ ఊంజల్ సేవ నిర్వహించి స్వామి వారికి పట్టు పీతాంబరాలను సమర్పించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం సతీసమేతుడైన స్వామివారు ముత్యపు పందిరి వాహనంలో పురవీధులలో జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారు ఊరేగుతుంటే భక్తులు అడుగడుగునా నీరాజనాలు అర్పించారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, తోమాలసేవ, సహస్రనామార్చన, నివేదన, నిత్య హోమం, కలశారాధన, ఇత్యాది కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు నిర్వహించారు.

ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను ఆన్‌లైన్ చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లా పరిషత్ పీఎఫ్ ఖాతాలకు సంబంధించి 2023–24, 2024–25 వార్షిక జమలను వెంటనే ఆన్‌లైన్ చేయాలని యూటీఎఫ్ జిల్లాశాఖ విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై శుక్రవారం జెడ్పీ సీఈఓ ఓబులమ్మను కడపలోని కార్యాలయంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ జిల్లాలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ జీత భత్యాల నుండి కొంత సొమ్మును ప్రతినెల పీఎఫ్ ఖాతాలకు పొదుపు కింద జమ చేస్తున్నారన్నారు. వీటి వివరాలను 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు మాత్రమే ఆన్‌లైన్ చేశారని, ఆ తర్వాత 2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు చేయలేదన్నారు. ప్రతి ఏడాది ఎప్పటికప్పుడు జెడ్పీ సిబ్బంది ఆన్‌లైన్ చేయకపోవడం వల్ల ఉపాధ్యాయులు చెల్లించిన సొమ్ములు సక్రమంగా ఖాతాలో జమ అవుతున్నాయో లేదో తెలుసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. అలాగే ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత అవసరాల రీత్యా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు రుణాల మంజూరులో జాప్యం జరుగుతోందన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రుణాల మంజూరు, తుది చెల్లింపుల మంజూరు విషయంలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు రవి కుమార్, జిల్లా ట్రెజరర్ నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రూతు ఆరోగ్య మేరీ, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, గోపీనాథ్, మేరీ ప్రసన్న, రామ కేశవ, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.


జెడ్పీ సీఈఓ ఓబులమ్మకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడపను స్వచ్ఛ నగరంగా తయారు చేయాలి

కడప కార్పొరేషన్: కడపను స్వచ్ఛ నగరంగా తయారు చేయుటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి అన్నారు. శుక్రవారం 11వ డివిజన్ మృత్యుంజయకుంటలో 'మన కడప–స్వచ్ఛ కడప' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమెతోపాటు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అక్కడి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ , శానిటేషన్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పుట్లంపల్లి చెరువు సుందరీకరణకు శంకుస్థాపన

కడప నగరం 15వ డివిజన్ పరిధిలోని పుట్లంపల్లి చెరువు సుందరీకరణ పనులకు ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్లంపల్లి చెరువును సుందరీరణ చేయడం ద్వారా ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా మార్చవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ దుగ్గిరెడ్డి, చెరువు కమిటీ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ రెడ్డి, రాజారెడ్డి, పాల కొండ దేవస్థాన చైర్మన్ రెడ్డయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మన కడప- స్వచ్ఛ కడప కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి, ఆర్. శ్రీనివాసులరెడ్డి

పొంచి ఉన్న ప్రమాదం


విద్యుత్ భవన్ ఎదురుగా..


రాజీవ్‌మార్గ్ రోడ్డు వద్ద..

కడప నగరంలో రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరా చేసే బాక్సులు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. నిరంతరం విద్యుత్ సరఫరా ఉండే ఈ బాక్సులకు తలుపులు లేక పోవడం ఆందోళన కలిగిస్తోంది. హై ఓల్టేజీ కలిగిన ఈ వైర్లను ప్రమాదవశాత్తు తాకితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప


నాగరాజుపేట ప్రాంతంలో ..

ఎస్సీ, ఎస్టీలపై వేధింపులు తగవు

కడప కార్పొరేషన్: అధికారం ఉందని ఎస్సీ, ఎస్టీ, బీసీలను వేధించడం సరైన పద్ధతి కాదని దళిత ఫోరం జిల్లా కన్వీనర్ బూసిపాటి కిశోర్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు పెరిగాయని, అధికారం ఉందని విర్రవీగి ఇలా దాడులకు పాల్పడడం అనైతికమన్నారు. కడప నగరంలోని మాసాపేటలో అధికారులను అడ్డం పెట్టుకొని అధికార పార్టీ నేతలు వాటర్ ప్లాంట్ కూల్చివేత యత్నం కూడా ఇందులో భాగమేనన్నారు. మాసాపేట లో ఉంటున్న ఎంతోమంది దళితుల కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇప్పించేందుకు మాజీ కార్పొరేటర్, దివంగత బక్క అయ్యన్న వినతి మేరకు దివంగత వైఎస్ఆర్ హయాంలో ప్రతిపాదనలు సిద్ధం చెయ్యగా, గత ప్రభుత్వంలో ఆ ప్రాంతంలోని స్థలం సర్వే నెంబర్ల క్లాసిఫికేషన్ మార్చి రెవెన్యూ వారికి అప్పగించడం జరిగిందన్నారు. ఆ మేరకు అప్పట్లో 544 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి లేఅవుట్ వేసి ప్రతి ఇంటికి ప్లాట్ నెంబర్లు కూడా కేటాయించడం జరిగిందన్నారు. 35 మందికి పట్టాలు మంజూరు చేశారని, మిగతా వారికి పట్టాలిచ్చేలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ అంతటితో ఆగిందన్నారు. ఈ ప్రభుత్వానికి దళితుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే మిగిలిన వారికి కూడా ఇంటి పట్టాలు ఇచ్చి మంచిపేరు తెచ్చుకోవాలేగానీ, ఇలా దౌర్జన్యాలు చేయడం తగదన్నారు. ఇదే వాటర్ ప్లాంటుకు నగరపాలక సంస్థ అధికారులు డోర్ నంబర్ కేటాయించి, ట్రేడ్ లైసెన్స్ మంజూరు చేశారని, అది అక్రమమని అప్పుడు ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నిధులతో అక్కడ వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టారని, దానికి కార్పొరేషన్ అధికారులే వర్క్ ఆర్డర్ ఇచ్చారన్నారు. దళిత కాలనీలో రూ.5 సురక్షిత తాగునీరు ఇస్తుంటే ఓర్వలేక ఇలా చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో దళితఫోరం నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దళిత ఫోరం కన్వీనర్ బూసిపాటి కిశోర్

నృత్య నీరాజనం


కళాకారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో వార్షిక, రజతోత్సవ సందర్భంగా తిరుమల–తిరుపతి దేవస్థానాల సంగీత నృత్య కళాశాల విద్యార్థులు తమ నృత్యాలతో ఆ దేవదేవునికి నృత్య నీరాజనం అర్పించారు. నర్తకీమణులు చక్కని తాళ, లయ గతులతో అంతకుమించిన లాస్యంతో చక్కని అభినయాన్ని ప్రదర్శించి తమ అభినివేశాన్ని చాటుకున్నారు. వారి గురువు హరినాథ్ కూచిపూడి, భరత నాట్యం, పేరిణి నృత్యాలు గురించి వివరించారు. కార్యక్రమ నిర్వాహకులు దేసు వెంకటరెడ్డి ఇలాంటి కార్యక్రమాల వల్ల ప్రజల్లో ముఖ్యంగా బాలల్లో విలువలు అభివృద్ధి చెందగలవని తెలిపారు. రజతోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మూడవ రోజు శనివారం శ్రీ కోదండ రామాలయ ఆవరణలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అర్చక బృందం కూడా తిరుమల నుంచే వస్తారని, పూజోత్సవాలన్నీ వారే నిర్వహిస్తారని ఆయన వివరించారు. భక్తులు పూజలకు తరలిరావాలన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కడప కార్పొరేషన్: కడప నగరంలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ముత్రాస్ పల్లి, రెడ్డి కాలనీ, ఫక్కీరుపల్లి, ఓం శాంతి నగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్, విద్యా మందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి బార్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సిపి బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

అన్నీ అమరావతికేనా.?


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాయలసీమ అభివృద్ధి వేదిక ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు వారు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా మాట్లాడుతూ రాష్ట్రంలోని అతి పెద్దదైన ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ లో మిగిలిన గ్రామీణ బ్యాంకులు విలీనం అవుతున్న నేపథ్యంలో ఇక్కడి ప్రధాన కార్యాలయాన్ని ఇక్కడే కొనసాగించాలన్నారు. వ్యాపారంలో, లాభాల్లో, మౌలిక సదుపాయాలు కలిగి ఉండడం, సాంకేతికత ఇలా అన్నింటా ఏపీజీబీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. అలాంటి బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడమంటే వెనకబడిన ప్రాంతాల పట్ల కక్ష పూరిత వైఖరి ప్రదర్శించడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు ప్రవీణ్, లోహిత్, మనోజ్, రవి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్: జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ శుక్రవారం న్యాయ సేవాసదన్ లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ ఈ నెల 9న నిర్వహించనున్న బాండెడ్ లేబర్ నిర్మూలన దినం గురించి తెలియజేశారు. బాండెడ్ లేబర్స్ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు బాండెడ్ లేబర్ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప రెవెన్యూ డివిజనల్ అధికారి పి. జాన్ ఎర్విన్, డిస్ట్రిక్ ట్రైనింగ్ కాలేజ్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కరీం, డిస్ట్రిక్ ప్రొబేషన్ అధికారి చెన్నారెడ్డి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్ యాదవ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఇతర అధికారులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

కడప కార్పొరేషన్ : ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మేసా ప్రసాద్, షాజహాన్‌లను పార్టీ నేత సుబాన్‌బాష, కార్పొరేటర్ షంషీర్, చాక్లెట్ గౌస్‌లు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.